క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ సాధించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.జే. ప్రకాష్

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణ సాధించడమే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ధ్యేయమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. జే ప్రకాశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని జై కిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాయలసీమ ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శిగా పగడం రాఘవయ్య, నంద్యాల జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జిగా సోమన్న, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నగేష్, ప్రధాన కార్యదర్శిగా పగడం శేఖర్, మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ వర్గీకరణతోనే మాదిగలు అన్ని రంగాల్లో రాణించగలరని చెప్పారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు క్రిష్ణమాదిగ, గంధం శ్రీనివాస్‌మాదిగ, సుబయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న భూరక్ష సర్వే



నెహ్రూనగర్‌లో భూములను సర్వే చేస్తున్న అధికారులు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో జగనన్న భూరక్ష పథకంలో భాగంగా గ్రామంలోని పొలాను అధికారులు ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. ఆధునిక యంత్రపరికాలను వినియోగించి రైతుల సహకారంతో గ్రామంలోని పొలాలను సర్వే చేస్తున్నారు. సర్వేలో భాగంగా పొలాలకు సంబంధించి రైతుల వద్ద ఉన్న పట్టా కాగితాలు, రిజిష్టర్ పత్రాలను పరిశీలించి వాటి వివరాలను నమోదు చేసుకుంటున్నారు.

అక్రమ లే అవుట్లపై చర్యలు తప్పవు

నందికొట్కూరు: అక్రమ లే అవుట్లపై కుడా, ఏపీఎం యాక్టు ప్రకారం చట్ట పరమైన చర్యలు తప్పవని కర్నూలు పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) వైస్ చైర్మన్ ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణం చుట్టూ వెలిసిన అక్రమ లే అవుట్లను ప్లానింగ్ ఆఫీసర్ విజయభాస్కర్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటిలో 204-బీ1లో రెండు ఎకరాలు, 170-సీ, 182 సర్వే నెంబరులో మూడు ఎకరాలు, 718లో ఆరు ఎకరాలు, 792లో నాలుగు ఎకరాలు, 713, 749, 750లో ఆరు ఎకరాల అక్రమ లే అవుట్లను పరిశీలించామన్నారు. పట్టణ ప్రణాళికాధికారి బాలమద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించండి

కొత్తపల్లి: జగనన్న సురక్ష పథకంలో భాగంగా సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని గుర్తించాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో జగనన్న సురక్షపై సమావేశం నిర్వహించారు. గ్రామ వలంటీర్లు వారి పరిధిలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి అర్హత ఉన్న వారికి సర్టిఫికెట్లు వచ్చేలా చూడాలన్నారు. ఎంపీటీసీ స్రవంతి, సచివాలయ కన్వీనర్ నాగలక్ష్మిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మహానంది: బండిఆత్మకూరు మండల విద్యాశాఖాధికారిగా యశోద సోమవారం బాధ్యతలు చేపట్టారు. కోవెలకుంట్ల మండల కేంద్రలోని జెడ్పీ పాఠశాలలో హెచ్ఎం, ఇన్‌చార్జ్ ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆమెను కన్వర్షన్‌పై బండిఆత్మకూరుకు పంపారు. ఇక్కడ పనిచేస్తున్న కరీముల్లా అన్నమయ్య జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

ముమ్మరంగా రైల్వేలైన్ మరమ్మతు పనులు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ వద్ద రైల్వే లైన్ మరమ్మతు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సోమవారం రైల్వే లైను వెంట రైల్వేశాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పర్యటించారు. పనులు పూర్తయితే మంగళవారం లేదా బుధవారం నుంచి రాకపోకలు సాగుతాయని అధికారులు తెలిపారు.

ముగ్గురి బైండోవర్

మహానంది: గోపవరం గ్రామంలో బంధువులైన రెండు కుటుంబాల మధ్య స్థలం, ఆస్తి పంపకాల విషయంలో వివాదం జరుగుతుండంతో ముగ్గురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.. గ్రామానికి చెందిన రవికుమార్, వారి బంధువులైన చలపతి, పుల్లయ్యల మధ్య వివాదం నడుస్తోంది.

నాగలూటిలో వైద్య శిబిరం

మిడుతూరు: నాగలూటిలో మలేరియా కేసులు నమోదు కావడంతో సోమవారం గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. అలాగే ఈఓఆర్డీ ఫక్రుద్దీన్ పారిశుద్ధ్య చర్యలు చేపట్టి స్ప్రేయింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేయించారు. కడుమూరు పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్ గౌడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మా వద్దకే వచ్చి సర్టిఫికెట్లు ఇచ్చారు



జగనన్న సురక్ష కార్యక్రమంతో అధికారులు మా వద్దకే వచ్చి సర్టిఫికెట్లు ఇచ్చారు. నేను మా పిల్లలకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నాం. ఎలాంటి సర్వీసు చార్జీలు తీసుకోకుండా ఉచితంగా ఇచ్చారు. వలంటీరు, సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి, ఏమైనా ధ్రువీకరణ పత్రాలు కావాలా అని కోరారు. పిల్లలకు సర్టిఫికెట్లు కావాలని అడుగగా వెంటనే జారీ చేయించారు. కార్యాలయాల వద్దకు వెళ్లే పని లేకుండా మాకు సర్టిఫికెట్లు ఇవ్వడం చాలా సంతోషకరం.

– మౌలాలి, కృష్ణానగర్, పాములపాడు మండలం

కార్యాలయాల చుట్టూ తిరిగే పని తప్పింది



రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ధ్రువీకరణ పత్రాల (డెత్, కుల, ఆదాయ, బర్త్) కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని తప్పింది. గతంలో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పత్రాలు అందేవి కాదు. జగనన్న ప్రవేశ పెట్టిన సురక్ష కార్యక్రమం ద్వారా ఎక్కడికీ వెళ్లాల్సిన పని లేకుండా ఉన్న చోటనే కులము, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు చేతికందించారు.

– పోలయ్య, మిడుతూరు

ఉద్యాన రైతుకు ఉపయుక్తంగా..

- ప్రతి మండలానికి ఉద్యాన సేకరణ కేంద్రం
- రైతులు పండించిన పంటలను గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకునే వెసలుబాటు
- గిట్టుబాటు ధరలకు విక్రయించుకునేలా మార్కెట్ సౌకర్యం
- నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో రూ.1.50కోట్లతో నిర్మాణాలు





జూపాడుబంగ్లాలో నిర్మించిన ఉద్యాన వన పంటల సేకరణ కేంద్రం

జూపాడుబంగ్లా: జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతుల సంక్షేమం కోసం నిరంతరం తపిస్తున్నారు. వ్యవసాయం దండగన్న చంద్రబాబు నాయుడు నోరు మూతపడేలా రైతులు వ్యవసాయంలో రాణించేలా వారిని ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఉద్యాన రైతులను ప్రోత్సహిస్తూ వారు పండించిన కూరగాయలు, పండ్లను నిల్వచేసుకొని, గిట్టుబాటు ధరలకు విక్రయించుకునేలా నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లోని 10 మండలాల్లో కలెక్షన్ సెంటర్లను (ఉద్యాన సేకరణ కేంద్రాలు) నిర్మించారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల రైతులకు ప్రాధాన్యత

రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లోని రైతులను బలోపేతం చేసి వారు పండించిన హార్టికల్చర్ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి వారిని అభివృద్ధి బాటలో నడిపించేందుకుగాను ప్రభుత్వం ప్రతి మండలంలో రూ.15లక్షలతో ఓ కలెక్షన్ సెంటర్‌ను నిర్మించింది. ఈ సెంటర్లలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లోని రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, టమాటా, మామిడి, నిమ్మ, బత్తాయి, తదితర పండ్లను చేర్చుకుంటారు. అక్కడ వాటిని గ్రేడింగ్ చేసి, శుభ్రపరచి నాణ్యమైన వాటిని ప్యాకింగ్ చేసి సమీపంలోని పట్టణాలకు, సూపర్ మార్కెట్లకు తరలించేలా రవాణా సౌకర్యాలు కల్పిస్తారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లోని సీఈఓలు కలెక్షన్ సెంటర్లలోని పండ్లు, కూరగాయలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించటంతో పాటు గిట్టుబాటు ధరలకు అమ్ముడుపోయేలా చర్యలు తీసుకుంటారు.

రూ.1.50 కోట్లతో 10 కలెక్షన్ సెంటర్లు

నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి, శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో కలెక్షన్ సెంటర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఒక్కో దానికి రూ.15లక్షల నిధుల చొప్పున రూ.1.50కోట్లు వెచ్చించారు. జూపాడుబంగ్లా, నందికొట్కూరు మండలంలోని 10బొల్లవరంలో భవనాల నిర్మాణాలు ఇప్పటికే పూర్తి అయ్యాయి. మిగిలిన మండలాల్లో పూర్తికావొచ్చాయి. నెలాఖరులోగా పనులు పూర్తిచేసి ఎఫ్‌పీఓ సంఘాలకు అప్పగించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

75 శాతం రాయితీతో కలెక్షన్ సెంటర్ల నిర్మాణం

గ్రామాల్లోని రైతులు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే 75 శాతం రాయితీతో కలెక్షన్ సెంటర్ నిర్మించి ఇస్తారు. ఓ కలెక్షన్ సెంటర్ నిర్మాణం విలువ రూ.15లక్షలు కాగా రైతుల వాటా కేవలం 25 శాతంగా రూ.3.75 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.11.25 లక్షల మొత్తంలో ఎంఐడీహెచ్ వాటా 40 శాతం రూ.6లక్షలు, ఆర్‌కేవీవై వాటా 35 శాతం రూ.5.25 లక్షలు వంతున మొత్తాన్ని చెల్లించి కలెక్షన్ సెంటర్‌ను నిర్మించి రైతులకు ఇస్తారు.

గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకోవచ్చు



రైతులు పండించిన కాయగూరలు గ్రేడింగ్ చేసుకొని నిల్వచేసుకునే వెసలుబాటు లేకపోవడం, మార్కెటింగ్ సౌకర్యం లేక తక్కువరేట్లకు వ్యాపారులకు విక్రయించుకొని నష్టపోతున్నారు. ప్రభుత్వం నిర్మించిన కలెక్షన్ సెంటర్‌లో దిగుబడులను గ్రేడింగ్ చేసుకొని శుభ్రం చేసి ప్యాకింగ్ చేసుకునే వెసలుబాటు ఉంటుంది. తద్వారా పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

– జగదీశ్వరుడు, ఎఫ్‌పీఓ అధ్యక్షుడు, తాటిపాడు

త్వరలో అన్ని కలెక్షన్ సెంటర్లను రైతులకు అప్పగిస్తాం



ప్రతి మండలానికో సెంటర్ చొప్పున నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో 10 కలెక్షన్ సెంటర్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. వాటిల్లో రెండు పూర్తికాగా మిగిలిన వాటి పనులు చివరిదశలో ఉన్నాయి. వాటిని ఈనెలాఖరులోగా పూర్తిచేసి రైతులకు అప్పగిస్తాం. – తేజస్విని, ఉద్యానవనశాఖ అధికారిణి, నందికొట్కూరు.

ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామానికి చెందిన విశ్వేశ్వరరావు దంపతుల కుమార్తె గంగోత్రి గుండెజబ్బుతో బాధపడుతోంది. గ్రామ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసులు విషయాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మానవత్వంతో స్పందించారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు రూ.పదివేలు ఆర్థికసాయం అందించారని శ్రీనివాసులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబాలకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అండగా ఉంటున్నారన్నారు.

ఆర్థిక సాయం

మిడుతూరు: మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన బిలకల గూడూరు బాషా(52) గుండెపోటుతో ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రెడ్డివారి రామ్మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు బాధిత కుంటుంబాన్ని పరామర్శించారు. ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

నందికొట్కూరు: ప్రజల సమస్యలను పరిష్కరిందుకు స్పందన కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు అన్నారు. సోమవారం పట్టణంలో రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలి

జూపాడుబంగ్లా: విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణ దారులు తప్పనిసరిగా రైతుల పేరున బిల్లులు ఇవ్వాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని తంగడంచ గ్రామంలోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

చెంచుగూడెంలో మరణాలపై విచారణ



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్యాధికారులు

పాములపాడు: మండలంలోని వేంపెంట చెంచుగూడెంలో ఇటీవల సంభవించిన వరుస మరణాలపై సోమవారం డీఎల్ఓ శారదాబాయ్, డాక్టర్ నాగలక్ష్మీ దేవి, ఎంపీడీఓ గోపీకృష్ణ విచారణ చేపట్టారు. కాలనీని సందర్శించి మృతి చెందిన పెద్ద వీరన్న, నాగవల్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నాగవల్లి టీబీ మందులు ఆరు నెలలు వాడిందని, ఆమె కోర్సు జూన్ 20వ తేదీకి అయిపోయినట్లు వెల్లడించారు. అలాగే పెద్ద వీరన్న ఆయాసంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారని చెప్పారు. వీరికి పౌష్టికాహారం కూడా అందిందినట్లు చెప్పారు.

విత్తు పనులు ప్రారంభం

వెలుగోడు: మండలంలో వారం రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు సోమవారం నుంచి విత్తనాలు వేయడం ప్రారంభించారు. మండలంలో గత వారంలో రెండు రోజుల పాటు వర్షాలు కురిశాయి. ఓ మోస్తరు వర్షంతో నేల తడిసి.. సాలుల్లోకి నీరు వచ్చింది. నెల రోజుల నుంచి వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు విత్తనాలు వేస్తున్నారు. రైతులతో పాటు ఎకరానికి ముగ్గురేసి కూలీలు పని చేస్తున్నారు. మినుము, పత్తి విత్తనాలు, మొక్కజొన్న విత్తనాలు ఎక్కువగా వేస్తున్నారు. మరో రెండు రోజులు వర్షాలు పడితే పెద్ద ఎత్తున విత్తనాలు వేసే అవకాశముంది.

12.8మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

పాములపాడు: మండలంలో ఈ నెల 2న రాత్రి కురిసిన వర్షపాతం 12.8మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ రత్నారాధిక సోమవారం తెలిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి ప్రస్తుతం కురిసిన వర్షమే ఓ మోస్తరు. కాగా రైతులు విత్తనాలు విత్తడానికి అదునుగా ఉందని భావించి పొలాల్లో విత్తనం వేయడానికి సిద్ధమయ్యారు. ట్రాక్టర్లు, కూలీలతో ప్రధానంగా మొక్కజొన్న విత్తనం నాటుచున్నారు.



పాములపాడు వద్ద విత్తనాలు వేస్తున్న కూలీలు

కొత్తపల్లిలో 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం

కొత్తపల్లి: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. మండల కేంద్రంలో 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదనైనట్లు ఏఎస్ఓ రాజ్‌పాల్ తెలిపారు. ఆదివారం కురిసిన వర్షం మొలకెత్తున్న మొక్కజొన్న, పత్తి పంటలకు జీవనం పోసినట్లైందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు సన్మానం

ఆత్మకూరు: పట్టణంలోని 20 వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మిని అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. యునియన్ నాయకురాలు మంజుల, స్వాములు, లక్ష్మీదేవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తను సన్మానిస్తున్న దృశ్యం

బిస్కెట్ల ఆశచూపి బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

జూపాడుబంగ్లా: ఐదేళ్ల బాలికకు బిస్కెట్లు ఆశచూపి 60ఏళ్ల వృద్ధుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని మండ్లెం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని ముస్లిం కాలనీకి చెందిన ఐదేళ్ల బాలిక సోమవారం సాయంత్రం స్కూలు నుంచి వచ్చాక ఇంటికి సమీపంలో స్నేహితులతో కలిసి ఆడుకుంటోంది. అదే కాలనీకి చెందిన షేక్ గని మహబూబ్‌బాషా(60) బాలికకు బిస్కెట్లు కొనిస్తానని నమ్మబలికి సమీపంలోని మౌలాలిస్వామి పీర్లచావిడిలోకి తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారయత్నానికి పాల్పడటంతో బాలిక గట్టిగా కేకలు వేసింది. స్థానికులు గమనించి లోనికి వెళ్లి అతనికి దేహశుద్ధి చేసి విషయం పోలీసులకు తెలియజేశారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

కోలుకోలేక వృద్ధుడు మృతి

మిడుతూరు: గడివేముల మండలం కరిమద్దెల గ్రామానికి చెందిన తెలుగు నారాయణ (68) 27వ తేదీ గార్గేయపురం నుంచి కరిమద్దెల గ్రామానికి ట్రాక్టర్‌లో వెళ్తుండగా రోళ్లపాడు క్రాస్ వద్ద ట్రాలీ బోల్తా పడటంతో గాయపడ్డాడు. అతడని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం రాత్రి మృతిచెందాడని ఎస్ఐ మారుతి శంకర్ తెలిపారు.

కేసు నమోదు

మహానంది: గాజులపల్లె పరిధిలోని అటవీశాఖలో ఎఫ్‌బీఓగా విధులు నిర్వహిస్తున్న మద్దిలేటిస్వామిని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మహానంది ఎస్ఐ జి.నాగేంద్రప్రసాద్ తెలిపారు. గాజులపల్లె గ్రామానికి చెందిన నలుగురు సైకిళ్లపై వెదురు బొంగులు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. వాటిని బంగ్లాకు తరలించాలని మద్దిలేటిస్వామి ఆదేశించారు. అయితే వారిలో ముగ్గురు తీసుకెళ్లగా గాజులపల్లెకు చెందిన జుబేర్ మరో యువకుడితో కలిసి మద్దిలేటి స్వామిని తోసేశాడు. జుబేర్, సొహైల్‌లపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

వైభవంగా శాకాంబరీ ఉత్సవం

మహానంది: మహానందిలో ఆషాఢమాసం, పౌర్ణమి సందర్భంగా సోమవారం శ్రీ కామేశ్వరీ అమ్మవారికి శాకాంబరీ ఉత్సవం కనుల పండుగగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ఆలయ ముఖ్య అర్చకులు వనిపెంట ప్రకాశం శర్మ, శరభయ్యశర్మ తదితరులు ఉదయం నుంచి శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అమ్మవారికి విశేషంగా అలంకరించారు. కూరగాయలతో అష్టోత్తరపూజలను చేసి అమ్మవారికి శాస్త్రీయంగా సహస్ర శాకార్చన, అలంకార హారతులు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో దాత నంద్యాల మార్కెట్ ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కనుల పండువగా పల్లకోత్సవం

శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. స్వామి,అమ్మవార్లకు విశేష అలంకరణ చేపట్టి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తుల మధ్య ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం జరిపించారు.



అమ్మవారిని అలంకరించేందుకు పండ్లు, కూరగాయలు సిద్ధం చేస్తున్న దృశ్యం

అమ్మవారి ఆరాధనతో ఆయురారోగ్యాలు

శ్రీ వైష్ణవీ దేవి ఆరాధనతో ఆయురారోగ్యాలు చేకూరుతాయని హైదరాబాద్‌లోని శ్రీ వైష్ణవి పీఠం పీఠాధిపతి శ్రీ అమ్మవైష్ణవి రామకృష్ణ తెలిపారు. మహానందిలోని అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నసత్ర భవన మండపంలో ఐదు రోజుల పాటు పూజలు చేపట్టిన ఆయన పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం షుగర్ వ్యాధిగ్రస్తులకు తీర్థం పంపిణీ చేశారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజాదికాలు చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీన్నులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఈ-కేవైసీ తప్పనిసరి

వెలుగోడు: వ్యవసాయ భూమి కలిగిన రైతులకు పంటలు సాగు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్)కి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.పవన్ కుమార్ తెలిపారు. ఏడాదిలో మూడు విడతలుగా రూ.6వేలు పీఎం కిసాన్‌కు దరఖాస్తు చేసుకున్న రైతుల ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. మండల పరిధిలో పీఎం కిసాన్ పథకం కింద నమోదైన 452 మంది రైతులు ఇంత వరకు ఈ కేవైసీ చేసుకోలేదు. వీరందరూ ఈనెల 31వ తేదీలోపు దగ్గరలో ఉన్న ఆర్బీకే, మీసేవ కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్సీ) ను గానీ సందర్శించి ఈ కేవైసీ చేసుకోవాలని సూచించారు. వీఏఏలు రామకష్ణ, వెంకట శివ, పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



ఆత్మకూరులో ప్రత్యేకాలంకరణలో షిరిడీ సాయి



శ్రీశైలంలో దక్షిణామూర్తి, వేదవ్యాసుడు చిత్రపటాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



ఆత్మకూరులో కనుల పండువగా షిరిడీ సాయి రథోత్సవం



వెలుగోడు సాయిబాబ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దశ్యం



జూటూరులో బాబాను దర్శించుకుంటున్న భక్తులు



సున్నిపెంటలో భక్తులకు అన్నప్రసాద వితరణ



తంగడంచ సమీపంలోని ఆలయంలో సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు: పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 4 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, కాగడహారతుల పూజలు నిర్వహించారు. స్వామి వారికి భక్తులు సత్యసాయి వ్రతాలను నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కరోనా అనంతరం ఈ ఏడాది పెద్ద ఎత్తున తిరిగి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిచారు. బాబా రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు, కాగడహారతులు, శయనోత్సవం, మహామంగళహారతి సేవలతో పాటూ భజన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుబ్రహ్మణ్యం, ఆత్మకూరు సాయి బాబాసేవా కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పువ్వాడ భాస్కర్, విజయచౌదరి పాల్గొన్నారు.

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి, హేమారెడ్డిమల్లమ్మ మందిరం వద్ద, దక్షిణామూర్తి స్వామివారికి, వ్యాస మహర్షికి విశేషపూజలు నిర్వహించారు. ముందుగా అర్చకులు, వేదపండితులు పూజా సంకల్పాన్ని పఠించి మహాగణపతి పూజను జరిపించారు. అనంతరం దక్షిణామూర్తి, వ్యాసమహర్షి చిత్రపటాలకు షోడశోపచార పూజలు జరిపారు. అనంతరం వేదపండితులు వేదపారాయణాలను చేశారు. అర్చకులు, వేదపండితులు గురుపరంపర మంత్రాలను పఠించారు. అలాగే హఠకేశ్వరం వద్ద గల శ్రీసోమనాథక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రంలోని అఖండ మహామృత్యుంజయ యజ్ఞము, సోమనాథ మహర్షుల పాదుక పూజ నిర్వహించారు. యజ్ఞానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

వెలుగోడు: పట్టణంలోని షిరిడీ సాయిబాబ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే భక్తులు క్యూ లైన్‌లో బారులు తీరారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఆలయ అర్చకుల చేత అక్షర శ్రీకర, కుంకుమార్చన పూజలు చేయించారు. మధ్యాహ్నం దాదాపు 6 వేల మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు.

పాములపాడు: గురుపౌర్ణమి వేడుకలను మండలంలోని జూటూరు, వాడాల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. జూటూరు నాగసాయి విద్య బ్రహ్మ ఆశ్రమ పీఠాధిపతి శ్రీరామానంద స్వామి వారు బాబా ప్రవచనాలు వినిపించారు. రాత్రి వేళలో భజనలు చేశారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలోని సాయిబాబా దేవాలయంలో సోమవారం గురపౌర్ణమి వేడుకలను గ్రామస్తులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ, తరిగోపుల గ్రామాల్లోని దేవాలయాల్లోని సాయిబాబా ప్రతిమలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తాము మొదలు పెట్టే ప్రతి కార్యక్రమంలో ఆదిగురువుగా ఉంటూ పనులు సవ్యంగా సాగేలా చేయాలని మొక్కులు తీర్చుకున్నారు.

పగిడ్యాల: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లోని భక్తులు భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన షిరిడీ సాయిబాబ ఆలయంలో పురోహితులు సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొలనుభారతి దేవి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా అమ్మవారికి పంచసూక్తములతో అభిషేకం, అర్చనలు, మంగళహారతి పురోహితులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం చిన్నారులకు బీజాక్షరాలు దిద్దించి అక్షరభ్యాసం చేయించారు. భక్తులకు ఆర్యవైశ్యసత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మరకతలింగేశ్వరుడి మహారుద్రాభిషేకం

మహానంది: జిల్లాలోని ఏకైన నవగ్రహదేవాలయాలైన గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో వెలిసిన శ్రీ గంగా, గౌరీసమేత మరకతలింగేశ్వరస్వామికి సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు వైశ్యరత్న కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు. గురువుకు మేధాసూక్తంతో అభిషేకం, చంద్రుడికి శ్రీసూక్తంతో అభిషేకం పూజలు చేశారు.

మౌన స్వామి ఆశ్రమంలో హోమాదిక్రతువులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని మౌన స్వామి ఆశ్రమంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని లోకకల్యాణం కోసం హోమాది క్రతువులను సోమవారం నిర్వహించారు. విశేషపూజల అనంతరం వేదమంత్రోచ్చరణలతో హోమాలకు పూర్ణాహుతి నిర్వహించారు.



ప్రత్యేక అలంకారంలో మరకత లింగేశ్వరుడు

శ్రీశైలంప్రాజెక్ట్: గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం శ్రీసాయిబాబ దేవాలయంలో వేడుకలు జరిగాయి. శ్రీశైలం, సున్నిపెంట, లింగాలగట్టు, దోమల పెంట, ఈగల పెంట తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా సాయిబాబా దర్శనార్థం వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

ఓం సాయి శ్రీ సాయి జయజయసాయి

మహానంది: బుక్కాపురం సదానంద ఆశ్రమం వద్ద ఉన్న సాయిబాబా ఆలయంతో పాటు తిమ్మాపురం, అబ్బీపురం, అల్లీనగరం గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో సోమవారం కిటకిటలాడాయి. ఆలయానికి చేరుకున్న భక్తులు నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. మహానంది సమీపంలోని జీనశంకర తపోవనంలో ఆలయ కమిటీ కార్యదర్శి కమలపురి హనుమంతరెడ్డి, ప్రకాశం జిల్లాకు చెందిన మాతాజీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు చేపట్టి ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు.